వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 05 | సంచిక : 039
పేజీలు : 09 | వెల: రూ.5/-
సోమవారం
జనవరి 19, 2026
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net


## సర్పంచులు బాధ్యతాయుతంగా పని చేయాలి



9లో..

- కమిషనర్ శ్రుతి ఓజా, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్
- పల్లెల్లో సుపరిపాలనే లక్ష్యంగా శిక్షణ కార్యక్రమం
- జ్యోతి ప్రజ్వలనతో సర్పంచుల శిక్షణ ప్రారంభం





# దక్షిణాది కుంభమేళా

# మేడారం







- వనదేవతల చెంత రేవంత్ రెడ్డి
- మేడారంలో మొక్కు చెల్లింపు
- పునరుద్ధరించిన గద్దెల ప్రారంభం..
- నిలువెత్తు బంగారం సమర్పణ

కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిలు, అశేష భక్తజన ఆరాధ్య దైవాలు సమ్మక్క –సారలమ్మల సన్నిధిలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి భక్తిపారవశ్యంలో మునిగితేలారు. ములుగు జిల్లాలోని మేడారం వనదేవతల గద్దెలను, నూతనంగా పునరుద్ధరించిన ఆలయ ప్రాంగణాన్ని సోమవారం ఆయన శాస్త్రోక్తంగా పునఃప్రారంభించారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారి మేడారం వచ్చిన రేవంత్ రెడ్డికి అర్చకులు, ఉన్నతాధికారులు పూర్ణకుంభంతో ఘనస్వాగతం పలికారు.
ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవార్లను దర్శించుకున్నారు. తన మనవడితో కలిసి గద్దెలపైకి వెళ్లిన సీఎం, తన భక్తిని చాటుకుంటూ 'నిలువెత్తు బంగారం' (బెల్లం) మొక్కును చెల్లించుకున్నారు. త్రాసులో ఒకవైపు తాను, మరోవైపు బెల్లం ఉంచి తులాభారం వేయించుకుని వనదేవతలకు అర్పించారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రతి ఇంటా సుఖ, సంతోషాలు వెల్లి విరియాలని ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేడారం గద్దెల ప్రాంగణంలో చేపట్టిన అభివృద్ధి పనుల జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ప్రత్యేక పైలాన్‌ను రాష్ట్ర మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. – వరంగల్ వాయిస్, మేడారం

వివరాలు2లో..



9లో..

## కొత్తవారికి 'నో' ఛాన్స్

- పాత క్యాడర్‌కే ప్రాధాన్యం..
- ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్





9లో..

## సీఎం పర్యటన సూపర్ హిట్

- అడవిలో క్యాబినెట్ మీటింగ్ అద్భుతం | రాష్ట్ర మంత్రి సీతక్క
- పాట్లాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రకటన చారిత్రాత్మకం

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
సోమవారం, జనవరి 19, 2026









# దక్షిణాది కుంభ మేళా మేడారం

- వనదేవతల చెంత రేవంత్ రెడ్డి
- మేడారంలో మొక్కు చెల్లింపు
- పునరుద్ధరించిన గద్దెల ప్రారంభం..
- నిలువెత్తు బంగారం సమర్పణ

**వరంగల్ వాయిస్, మేడారం :** మేడారం సమ్మక్క–సారలమ్మ గద్దెల పునర్నిర్మాణం చేపట్టి భక్తులకు అంకితం చేసే అరుదైన అవకాశం లభించడం తన జీవితంలో అత్యంత పవిత్రమైన, మర్చిపోలేని జ్ఞాపకమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఉదయం కుటుంబ సభ్యులు, సహచర మంత్రులతో కలిసి ముఖ్యమంత్రి మేడారం వనదేవతలను దర్శించుకున్నారు. అనంతరం ముఖ్యమంత్రి తన అనుభూతిని పంచుకుంటూ.. “మేడారం సమ్మక్క–సారలమ్మ గద్దెలను ప్రజా ప్రభుత్వంలో పునర్నిర్మించే పవిత్ర అవకాశం రావడం నా పూర్వజన్మ సుకృతం. ఈ గడ్డ పోరాటాలకు నిలయం, ఆ స్ఫూర్తినే తమ ప్రభుత్వం కొనసాగిస్తుంది” అని తెలిపారు. తెలంగాణ ప్రజల ఆరాధ్య దైవాలైన వనదేవతల ఆశీస్సులు రాష్ట్ర ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ పర్యటనలో ముఖ్యమంత్రి వెంట ఆయన కుటుంబ సభ్యులతో పాటు రాష్ట్ర మంత్రులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా గద్దెల పునఃప్రారంభం..

మేడారం మహాజాతర ఏర్పాట్లలో భాగంగా నూతనంగా పునరుద్ధరించిన సమ్మక్క–సారలమ్మల గద్దెలను, ఆలయ ప్రాంగణాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం శాస్త్రోక్తంగా పునఃప్రారంభించారు. పునరుద్ధరించిన ఆలయ ప్రాంగణంలో వేద పండితులు మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా పూజా కార్యక్రమాలు పూర్తి చేసిన అనంతరం ముఖ్యమంత్రి గద్దెలను భక్తులకు అంకితం చేశారు. పురాతన సంస్కృతికి అద్దం పట్టేలా, భక్తుల రద్దీకి అనుగుణంగా గద్దెలను, ప్రాంగణాన్ని ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఆధునీకరించింది.

## నిలువెత్తు బంగారం సమర్పణ..

ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి అత్యంత భక్తిశ్రద్ధలతో అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఒక విశేష దృశ్యం అందరినీ ఆకట్టుకుంది. ముఖ్యమంత్రి తన మనవడిని ఎత్తుకుని సమ్మక్క–సారలమ్మల గద్దెలపైకి వెళ్లారు. తన మనవడితో కలిసి గద్దెల వద్దకు చేరుకున్న సీఎం, వనదేవతల పట్ల తనకున్న అపారమైన భక్తిని చాటుకున్నారు. అమ్మవార్లకు అత్యంత ప్రీతిపాత్రమైన ‘నిలువెత్తు బంగారం’ (బెల్లం) మొక్కును సమర్పించుకున్నారు. తన కుటుంబంపై, రాష్ట్ర ప్రజలపై అమ్మవార్ల చల్లని చూపు ఉండాలని ఈ సందర్భంగా ఆయన ప్రార్థించారు.

## ప్రత్యేక పైలాన్ ఆవిష్కరణ ..

మేడారం వనదేవతల గద్దెల ప్రాంగణంలో చేపట్టిన అభివృద్ధి పనులకు జ్ఞాపకార్థంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పైలాన్‌ను సీఎం రేవంత్ రెడ్డి సోమవారం ఆవిష్కరించారు. గద్దెల పునరుద్ధరణ, భక్తుల సౌకర్యార్థం ఆలయ ప్రాంగణంలో ప్రభుత్వం చేపట్టిన వివిధ నిర్మాణ పనుల వివరాలతో కూడిన ఈ పైలాన్‌ను రాష్ట్ర మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. మేడారం జాతర చరిత్రలో ప్రజా ప్రభుత్వం చేపట్టిన ఈ మార్పులు చిరస్థాయిగా నిలిచిపోతాయని ఈ సందర్భంగా సీఎం పేర్కొన్నారు. అనంతరం అధికారులతో కలిసి ప్రాంగణమంతా కలియతిరిగిన ముఖ్యమంత్రి, పనుల నాణ్యతను పరిశీలించారు.

## మంత్రి సీతక్క, జిల్లా అధికారుల నిరంతర పర్యవేక్షణ ..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మేడారం పర్యటన అత్యంత వైభవంగా, విజయవంతంగా ముగియడం వెనుక అధికార యంత్రాంగం నిరంతర కృషి స్పష్టంగా కనిపిస్తోంది. పర్యటన ఆద్యంతం ఎక్కడా చిన్నపాటి లోటుపాట్లు తలెత్తకుండా రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క స్వయంగా పర్యవేక్షించారు. సీఎం పర్యటన ఏర్పాట్లను ముందస్తుగానే ప్రణాళికాబద్ధంగా రూపొందించడంలో భూపాలపల్లి కలెక్టర్ దివాకర టీఎస్, ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ కీలక పాత్ర పోషించారు. భద్రతా పరంగా ఎస్పీ కట్టుదిట్టమైన చర్యలు తీసుకోగా, అభివృద్ధి పనులు , ప్రోటోకాల్ అంశాలను కలెక్టర్ పర్యవేక్షించారు. అదేవిధంగా, ఐటీడీఏ పీఓ చిత్రా మిశ్రా గద్దెల పునరుద్ధరణ పనులను, పైలాన్ ఆవిష్కరణ ఏర్పాట్లను దగ్గరుండి చూసుకున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర వీవీఐపీల రాకతో పాటు సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఈ అధికారులు చేసిన నిరంతర శ్రమను సీఎం రేవంత్ రెడ్డి, ప్రజాప్రతినిధులు ప్రత్యేకంగా అభినందించారు.









# గణపురం - హైదరాబాద్ బస్సును పునరుద్ధరించండి

- పరకాల డీఎం రాంప్రసాద్‌కు సర్పంచ్ విజ్ఞప్తి



**వరంగల్ వాయిస్, గణపురం:** గతంలో గణపురం నుంచి హైదరాబాద్‌కు నడిచిన బస్సు సర్వీసును తక్షణమే పునరుద్ధరించాలని సర్పంచ్ కట్కూరి రాధిక శ్రీనివాస్ పరకాల డిపో మేనేజర్ రాంప్రసాద్‌కు విజ్ఞప్తి చేశారు. శనివారం మేడారం జాతర నేపథ్యంలో గణపురం మండల కేంద్రంలోని సంత ఆవరణలో ఏర్పాటు చేయనున్న తాత్కాలిక బస్సు డిపో పనులను సర్పంచ్, ఆర్టీసీ అధికారులతో కలిసి డీఎం పరిశీలించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని రవాణా సమస్యలను సర్పంచ్ దంపతులు డీఎం దృష్టికి తీసుకెళ్లారు. గతంలో పరకాల డిపోకు చెందిన బస్సు రాత్రి 9 గంటలకు హనుమకొండ నుంచి బయలుదేరి, గణపురంలో రాత్రి బస (నైట్ హాల్ట్) చేసేదని వివరించారు. తెల్లవారుజామున 5 గంటలకు ఇక్కడి నుంచి నేరుగా హైదరాబాద్ వెళ్లేదని, ఈ సర్వీసు రద్దు కావడంతో విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ప్రస్తుతం మండల కేంద్రం నుంచి ఎక్స్‌ప్రెస్ సౌకర్యం లేని లోటును తీర్చాలని కోరారు. డీఎం రాంప్రసాద్ సర్పంచ్ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించారు. బస్సు సర్వీసు ఆవశ్యకత తమ దృష్టిలో ఉందని, ఉన్నతాధికారులతో చర్చించి త్వరలోనే ఈ సర్వీసును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. అలాగే మేడారం జాతర దృష్ట్యా ఏర్పాటు చేస్తున్న తాత్కాలిక డిపో వద్ద భక్తులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలని సర్పంచ్‌ను కోరారు. అనంతరం నూతనంగా ఎన్నికైన సర్పంచ్ రాధిక శ్రీనివాస్ దంపతులను ఆర్టీసీ డీఎం ఆధ్వర్యంలో శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏడీసీఆర్ మాణిక్యం, మేడారం ఇంచార్జి బి.సదానందం, ఆర్టీసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అమ్మల ఆశీర్వాదం.. అడవిని కాపాడితేనే!



**వరంగల్ వాయిస్, నడికూడ:** మేడారం మహాజాతరకు వెళ్లే భక్తులు కేవలం మొక్కులు చెల్లించడమే కాకుండా, వనదేవతల నిలయమైన అడవిని రక్షించాలని ముస్త్యాలపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు వినూత్న రీతిలో చాటిచెప్పారు. పర్యావరణ పరిరక్షణే పరమావధిగా ప్లాస్టిక్ వ్యర్థాల నివారణపై విద్యార్థులు చేపట్టిన చైతన్య కార్యక్రమం గ్రామస్థులను, ప్రయాణికులను విశేషంగా ఆకట్టుకుంది. జాతర సందర్భంగా అడవిలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ పారవేయడం వల్ల పర్యావరణం దెబ్బతింటుందని గ్రహించిన విద్యార్థులు, ప్రజల్లో మార్పు తెచ్చేందుకు నడుం బిగించారు. "నా ప్లాస్టిక్ నా బ్యాగ్‌లోనే", "మా చెత్త మా ఇంటికే", "అమ్మల ఆశీర్వాదం – అడవిని కాపాడితేనే" అనే నినాదాలతో వారు నిరసన కాకుండా అవగాహనను పంచారు. ప్రతి భక్తుడు తమ వెంట ఒక పాత క్యారీ బ్యాగ్ తీసుకెళ్లి, తాము వాడిన ప్లాస్టిక్ వ్యర్థాలను తిరిగి ఇంటికి తీసుకెళ్లాలని లేదా నిర్ణీత చోట వేయాలని విద్యార్థులు విజ్ఞప్తి చేశారు. జాతర కొన్ని రోజులు మాత్రమే ఉంటుందని, కానీ అడవి తరతరాల పాటు నిలిచి ఉండాలని విద్యార్థులు సందేశం ఇచ్చారు. ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, ప్రకృతిని కాపాడితేనే సమ్మక్క–సారలమ్మల ఆశీర్వాదం సంపూర్ణంగా లభిస్తుందని వారు స్పష్టం చేశారు. భక్తి అంటే కేవలం దర్శనం మాత్రమే కాదు, ప్రకృతిని ప్రేమించడం కూడా అని విద్యార్థులు నిరూపించారు. విద్యార్థుల ఈ సామాజిక బాధ్యతను చూసి పాఠశాల ప్రధానోపాధ్యాయులు కందుకూరి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పావని, సత్యపాల్ వారిని అభినందించారు. భావి భారత పౌరులుగా విద్యార్థులు చేస్తున్న ఈ ప్రయత్నం భక్తులలో గొప్ప మార్పు తీసుకువస్తుందని గ్రామస్థులు కొనియాడారు.

## కేయూలో రెండు రోజుల జాతీయ సదస్సు

**బ్రోచర్‌ను విడుదల చేసిన ఆచార్య సురేశ్ లాల్**



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాకతీయ విశ్వవిద్యాలయంలో ఫిబ్రవరి 26, 27 తేదీలలో 'వికసిత్ భారత్ లక్ష్యాలు – సుస్థిరాభివృద్ధి' అనే అంశంపై రెండు రోజుల పాటు జాతీయ సదస్సు నిర్వహించనున్నారు. ఈ సదస్సు నిర్వహణకు సంబంధించి సోషల్ సైన్స్, ఆర్ట్స్ డీన్ ఆచార్య బి.సురేశ్ లాల్ అధ్యక్షతన సోమవారం అర్థశాస్త్ర విభాగంలో సన్నాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సదస్సుకు సంబంధించిన బ్రోచర్‌ను కమిటీ సభ్యులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. కాకతీయ విశ్వవిద్యాలయ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో భాగంగా ఈ సదస్సును ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విశ్వవిద్యాలయ చరిత్రను నూతన కోణంలో ఆవిష్కరించేందుకు విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు పెద్ద ఎత్తున భాగస్వాములు కావాలని కోరారు. సదస్సు కోసం ఇప్పటి వరకు సుమారు 50 పరిశోధనా పత్రాల సారాంశాలు అందాయని డీన్ సురేశ్ లాల్ తెలిపారు. ఆసక్తి గల వారు తమ అబ్స్ట్రాక్ట్‌లను పంపే గడువును ఈనెల 27 వరకు పొడిగించినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ ఆర్.మేఘన, డాక్టర్ బి.రాధికా రాణి, డాక్టర్ ఎం.స్వర్ణలత, డాక్టర్ సంగని మల్లేశ్వర్, డాక్టర్ ఆకుతోట శ్రీనివాస్, డాక్టర్ సంకినేని వెంకటయ్య, డాక్టర్ టి.రాజ్ కుమార్, డాక్టర్ ఎం.లింగయ్య, డాక్టర్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# చీకటి నుంచి వెలుగుల వైపు..

- 'గోరుగుట్ట తండా'లో వెలిగిన వీధిదీపాలు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** మండలంలోని గోరుగుట్ట తండా గ్రామపంచాయతీ పరిధిలోని జగ్గు తండా ఎట్టకేలకు వెలుగుల జిలుగులను సంతరించుకుంది. స్థానిక సర్పంచ్ బానోత్ విజయలక్ష్మి భాస్కర్ నాయక్ చొరవతో తండాలో నూతనంగా విద్యుత్ స్తంభాలు, వీధిలైట్లు ఏర్పాటు చేశారు. సోమవారం ఈ లైట్లను ప్రారంభించడంతో తండా వీధులన్నీ కాంతులతో విరాజిల్లాయి. ఎన్నో ఏళ్లుగా సరైన వెలుతురు లేక, రాత్రి వేళల్లో చీకటిలో మగ్గుతున్నామని తండా వాసులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు, బాధ్యతలు చేపట్టిన వెంటనే సర్పంచ్ విజయలక్ష్మి ప్రత్యేక నిధులు కేటాయించి విద్యుత్ సమస్యను పరిష్కరించారు. వీధిలైట్ల ఏర్పాటుతో తమ దశాబ్దాల కల నెరవేరిందని, నూతన సర్పంచ్ పనితీరు అభినందనీయమని స్థానికులు కొనియాడారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. తండాలో మౌలిక వసతుల కల్పనే తన ప్రాధాన్యతని, ప్రజల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ ముందుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ భానోతు దేవేందర్, పార్టీ అధ్యక్షుడు వాగ్య నాయక్, నాయకులు వీరన్న, సంతోష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## రాదారపు శివకుమార్‌కు సన్మానం



**వరంగల్ వాయిస్, గీసుకొండ :** భారతీయ జనతా పార్టీ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన రాదారపు శివకుమార్‌ను సోమవారం గ్రేటర్ వరంగల్ 15వ డివిజన్ మొగిలిచర్లలో ఘనంగా సన్మానించారు. బీజేపీ మహిళా మోర్చా డివిజన్ అధ్యక్షురాలు బందేల రేణుక ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. శివకుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన మహిళా మోర్చా నాయకురాళ్లు, ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. సన్మానం అనంతరం రాదారపు శివకుమార్ మాట్లాడుతూ.. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా జిల్లాలో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానని తెలిపారు. "కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా నా కష్టంగా భావిస్తాను. మీకు ఏ ఆపద వచ్చినా ముందుండి కంటికి రెప్పలా కాపాడుకుంటాను" అని ఆయన భరోసా ఇచ్చారు. కార్యకర్తలకు, నాయకులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ అభినందన కార్యక్రమంలో తెలంగాణ కుమ్మర ప్రజాపతి సంఘం రాష్ట్ర అధ్యక్షులు సముద్రాల లక్ష్మీనారాయణ, రాష్ట్ర కార్యదర్శి ఇజ్జగిరి మల్లయ్య, బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ బిల్లా రమేష్ పాల్గొన్నారు. వీరితో పాటు డివిజన్ నాయకులు నరేడ్ల రాములు, రాదారపు రాధిక, నూనె కన్నయ్య, శాపర్తి శశిరేఖ, శాతరాజు నిర్మల, పంజా స్రవంతి, బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముగిసిన సంక్రాంతి క్రీడా సంబరాలు



**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** మండలంలోని అన్నారం షరీఫ్ గ్రామపంచాయతీ పరిధిలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని నిర్వహించిన క్రీడా పోటీలు శనివారంతో ఉత్సాహంగా ముగిశాయి. గ్రామపంచాయతీ పాలకమండలి ఆధ్వర్యంలో స్థానిక పల్లవి మోడల్ స్కూల్ మైదానంలో గత మూడు రోజులుగా వాలీబాల్, షటిల్, కబడ్డీ పోటీలను నిర్వహించారు. ముగింపు వేడుకల్లో భాగంగా విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. వాలీబాల్ మొదటి బహుమతి రూ.3016, గొడుగు రమేష్ టీం, రెండో బహుమతి రూ.2016 బుర్ర యాకయ్య టీం, షటిల్ మొదటి బహుమతి రూ. 2016 దురిశెట్టి శివ టీం, రెండో బహుమతి రూ.1016 మోటపోతుల సాయిరాం టీం, జూనియర్ కబడ్డీ మొదటి బహుమతి రూ. 1016, భాష బోయిన సాయి గణేష్ టీం, రెండవ బహుమతి రూ.516 ఎస్.కె సమీర్ టీం, షటిల్ జూనియర్ మొదటి బహుమతి రూ.516, వల్లాల అజయ్ టీం, రెండో బహుమతి రూ.216 కనుకుట్ల అభిరామ్ టీం గెలుపొందారు. గ్రామీణ క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో నిర్వహించిన ఈ పోటీలకు యువత నుంచి విశేష స్పందన లభించింది. గెలుపోటముల కంటే క్రీడా స్ఫూర్తి ముఖ్యమని నిర్వాహకులు పేర్కొన్నారు. బహుమతుల ప్రదానోత్సవంలో గ్రామపంచాయతీ సిబ్బంది, గ్రామ నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు, క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## క్యాలెండర్ ఆవిష్కరణ



**వరంగల్ వాయిస్, కాశీబుగ్గ:** ఓరుగల్లు గడ్డపై 'వరంగల్ వాయిస్' దినపత్రిక వార్తా సేకరణలో ముందంజలో ఉందని వరంగల్ తహసీల్దార్ టి.శ్రీకాంత్ కొనియాడారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో వరంగల్ వాయిస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో పత్రికలు కీలక పాత్ర పోషిస్తాయని, వరంగల్ వాయిస్ పత్రిక నిష్పక్షపాత వార్తలతో ప్రజల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్లు మహమ్మద్ సుబానుద్దీన్, గంద్రాతి సుమన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు కృష్ణస్వామి, దినకర్ బాబు, వరంగల్ వాయిస్ కాశీబుగ్గ రిపోర్టర్ వంగరి రవి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలి

## అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, బెన్ షాలోమ్



**వరంగల్ వాయిస్, జనగామ :** ప్రజల నుంచి వచ్చే సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని జిల్లా అదనపు కలెక్టర్లు పింకేష్ కుమార్, బెన్ షాలోమ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చారు. బాధితుల నుంచి వినతి పత్రాలను అదనపు కలెక్టర్లు స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా వారు అధికారులతో మాట్లాడుతూ.. ప్రజావాణిలో నమోదయ్యే గ్రీవెన్స్ దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వినతులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, తీసుకున్న చర్యల గురించి సంబంధిత దరఖాస్తుదారునికి తప్పనిసరిగా సమాచారం అందించాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ లక్ష్యం ప్రజల సమస్యలను త్వరితగతిన తీర్చడమేనని గుర్తు చేశారు.ఈరోజు నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 20 దరఖాస్తులు వచ్చాయి. భూ సమస్యలు, పెన్షన్లు, ఇతర వ్యక్తిగత సమస్యలపై ప్రజలు వినతులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ గోపిరామ్, వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# 21న చిట్యాల క్లస్టర్ స్థాయి 'సీఎం కప్' క్రీడలు

## ఎంపీడీవో జయశ్రీ, ఎంఈఓ రఘుపతి వెల్లడి

**వరంగల్ వాయిస్, చిట్యాల :** చిట్యాల క్లస్టర్ స్థాయి సీఎం కప్ క్రీడలను ఈనెల 21న చిట్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జయశ్రీ తెలిపారు. ఈ క్రీడా పోటీల నిర్వహణకు సంబంధించి సన్నాహక కార్యక్రమాలను మండల అధికారులు పర్యవేక్షించారు. మండల విద్యాధికారి కోడెపాక రఘుపతి మాట్లాడుతూ.. క్రీడల కోసం ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు, క్రీడాకారులందరూ బుధవారం ఉదయం 10 గంటలకే చిట్యాల హైస్కూల్ మైదానానికి చేరుకోవాలని సూచించారు. సకాలంలో హాజరై క్రీడా స్ఫూర్తిని చాటాలని కోరారు. ఈ క్లస్టర్ స్థాయి పోటీల్లో చిట్యాల గ్రామ పంచాయతీతో పాటు కైలాపూర్, ఏలేటి రామయ్య పల్లి, చింతకుంట రామయ్య పల్లె, నవాబ్ పేట గ్రామాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారని సీఎం కప్ క్లస్టర్ కోఆర్డినేటర్ సూదం సాంబమూర్తి వెల్లడించారు. అథ్లెటిక్స్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, యోగా క్రీడలు నిర్వహిస్తారు. క్రీడాకారులకు ఏవైనా సందేహాలు ఉంటే 9966992295 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలని కోరారు. చిట్యాల గ్రామ కార్యదర్శి రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

# మహారాష్ట్రలో బీజేపీ ప్రభంజనం

## వేల్పుల రాజ్ కుమార్ హర్షం



**వరంగల్ వాయిస్, దామెర :** మహారాష్ట్ర మున్సిపల్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ చారిత్రాత్మక విజయం సాధించడంపై బీజేపీ దామెర మండల అధ్యక్షులు వేల్పుల రాజ్ కుమార్ హర్షం వ్యక్తం చేశారు. దేశ ఆర్థిక రాజధాని ముంబైపై బీజేపీ జెండా ఎగరడం నూతన రాజకీయాలకు దిక్సూచి అని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ ముంబైలో మూడు దశాబ్దాలుగా కొనసాగుతున్న థాక్రేల ఆధిపత్యానికి ఈ ఫలితాలతో తెరపడిందన్నారు. మొత్తం 29 మున్సిపాలిటీలలో 25 చోట్ల బీజేపీ కూటమి జయకేతనం ఎగరవేసిందని, 60 శాతానికి పైగా వార్డులను కైవసం చేసుకుని క్లీన్ స్వీప్ చేసిందని తెలిపారు. మహారాష్ట్ర ప్రజలు వారసత్వ రాజకీయాలను తిరస్కరించి, ప్రధాని నరేంద్ర మోడీ అభివృద్ధి మంత్రానికే పట్టం కట్టారని ఆయన స్పష్టం చేశారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, ఎన్సీపీ (శరద్ పవార్), ఎంఎన్ఎస్ వంటి పార్టీలు ఘోరంగా విఫలమయ్యాయని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ కేవలం 324 వార్డులకే పరిమితం కాగా, పవార్ పార్టీ 36 వార్డులతో సరిపెట్టుకుందని, అనేక చోట్ల ఆ పార్టీలకు కనీసం అడ్రస్ కూడా లేదని విమర్శించారు. మహారాష్ట్ర ఫలితాల ప్రభావం తెలంగాణపై కూడా ఉంటుందని రాజ్ కుమార్ ధీమా వ్యక్తం చేశారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పరకాల గడ్డపై బీజేపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేస్తామని ఆయన పేర్కొన్నారు. అభివృద్ధిని కాంక్షించే ప్రజలంతా బీజేపీ వైపు ఉన్నారని తెలిపారు.

# గ్రామాల్లో అభివృద్ధి పనుల తనిఖీ

- జనగామలో పంచాయతీ రాజ్ కమిషనర్ శ్రుతి ఓజా పర్యటన
- ఉపాధి హామీ కూలీలతో ముఖాముఖి
- క్షేత్రస్థాయిలో పీఎంకేఎస్‌వై పనుల పరిశీలన
- కమిషనర్‌కు స్వాగతం పలికిన కలెక్టర్



**వరంగల్ వాయిస్, జనగామ :** పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ శ్రుతి ఓజా జిల్లాలో పర్యటించారు. సోమవారం జిల్లాకు విచ్చేసిన ఆమెకు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పూల మొక్కను అందించి ఘన స్వాగతం పలికారు. అనంతరం జిల్లాలోని పలు మండలాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను కలెక్టర్‌తో కలిసి కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. స్టేషన్ ఘన్‌పూర్ మండలం రంగరాయగూడెంలో పీఎంకేఎస్‌వై పథకం కింద నిర్మించిన చెక్ డ్యామ్, గ్యాబియాన్ నిర్మాణాలను కమిషనర్ తనిఖీ చేశారు. పనుల నాణ్యతపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీదికొండ గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉపాధి హామీ అమలు తీరుపై గ్రామస్తులు, పథకం లబ్ధిదారులతో సమావేశమయ్యారు. పథకాల అమలులో లబ్ధిదారులకు ఉన్న సందేహాలను నివృత్తి చేస్తూ, అధికారులకు పలు సూచనలు చేశారు. గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన కమిషనర్, పిల్లలకు అందించే పౌష్టికాహారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సిబ్బందిని ఆదేశించారు. గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. రఘునాథపల్లి ఎంపీడీఓ కార్యాలయాన్ని సందర్శించిన కమిషనర్ శ్రుతి ఓజా, అక్కడ కంప్యూటర్ కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఉపాధి హామీ కూలీలకు వేతనాలు సకాలంలో అందుతున్నాయా? లేదా? అని ఎంపీడీఓ శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకున్నారు. నిడిగొండ గ్రామంలో జరుగుతున్న మట్టి పనులను పరిశీలించిన ఆమె, కూలీలతో నేరుగా మాట్లాడారు. ప్రభుత్వం నిర్ణయించిన రూ. 307 వేతనం అందుతుందో లేదో ఆరా తీశారు. పనుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించవద్దని క్షేత్రస్థాయి అధికారులను హెచ్చరించారు. ఈ పర్యటనలో డీఆర్డీఓ వసంత, ఏడీఆర్డీఓ జి.చంద్రశేఖర్, డీఎల్పీఓ వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డితో పాటు వివిధ మండలాల ఎంపీడీఓలు, ఎంపీఓలు, అధికారులు పాల్గొన్నారు.

# కేయూ వసతి గృహాలకు 'ముల్కనూర్' బియ్యం



■ అవగాహన ఒప్పందం ఖరారు

**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్ :** కాకతీయ విశ్వవిద్యాలయ వసతి గృహాల్లోని విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించే లక్ష్యంతో విశ్వవిద్యాలయ పరిపాలన విభాగం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రసిద్ధ ముల్కనూర్ కోఆపరేటివ్ సొసైటీతో బియ్యం సరఫరా కోసం వర్సిటీ అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. సోమవారం ఉపకులపతి ఆచార్య కె.ప్రతాప్ రెడ్డి సమక్షంలో ఈ ఒప్పంద ప్రక్రియ పూర్తయినట్లు రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం తెలిపారు.ఈ ఒప్పందంపై వసతి గృహాల సంచాలకులు డాక్టర్ ఎల్.పి.రాజ్ కుమార్, ముల్కనూర్ కోఆపరేటివ్ ప్రతినిధులు రామ్ రెడ్డి, అభిలాష్ రెడ్డిలు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ.. ఈ ఒప్పందం ప్రాథమికంగా ఆరు నెలల పాటు అమల్లో ఉంటుందని వెల్లడించారు. ఎటువంటి మధ్యవర్తులు లేకుండా నేరుగా ఉత్పత్తి కేంద్రాల నుండే విశ్వవిద్యాలయ వసతి గృహాలకు బియ్యం సరఫరా అవుతుందని పేర్కొన్నారు. సరఫరా వ్యవస్థలో పారదర్శకత పెంచేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వర్సిటీ వర్గాలు తెలిపాయి. బియ్యం నాణ్యత, బరువు విషయంలో ఒప్పంద నిబంధనలను కచ్చితంగా అమలు చేస్తామని, విద్యార్థులకు మేలైన రకం బియ్యం అందేలా చూస్తామని రిజిస్ట్రార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ కాలేజీ ప్రిన్సిపాల్, వసతి గృహాల చైర్మన్ ఆచార్య టి.మనోహర్, ఆచార్య పి.మల్లారెడ్డి, ఆచార్య ఎన్.వాసుదేవ రెడ్డి, ఆచార్య ఆర్.మల్లికార్జున రెడ్డి, ఆచార్య పి.వరలక్ష్మి, ఆచార్య ఎస్.జ్యోతి, డాక్టర్ ఎన్.రమణ, అధికారులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

- ◆ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి
- ◆ ఇందిరమ్మ చీరలు, వడ్డీ లేని రుణాల పంపిణీ



**వరంగల్ వాయిస్, పరకాల :** మహిళలు అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలవాలన్నదే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పరకాల శాసనసభ్యుడు రేవూరి ప్రకాశ్ రెడ్డి అన్నారు. సోమవారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధిలోని మహిళలకు ఇందిరమ్మ చీరలను మరియు వడ్డీ లేని రుణాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేవూరి మాట్లాడుతూ.. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని తెలిపారు. పరకాల పట్టణ కేంద్రంలోని 103 మహిళా సంఘాలకు రూ.33,93,925 వడ్డీ లేని రుణాలను అందజేస్తున్నట్లు వెల్లడించారు. కుటుంబ అభివృద్ధిలో మహిళలే కీలకమని, వారు ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పుడే సమాజం బాగుంటుందని ఆయన పేర్కొన్నారు. మహిళలపై ఉన్న నమ్మకంతోనే పరకాలలో 'మహిళా డైరీ'ని ఏర్పాటు చేస్తున్నామని, దీనిలో ప్రతి మహిళా భాగస్వామ్యం కావాలని ఎమ్మెల్యే కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళా సంక్షేమానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. అర్హులైన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీరలు అందేలా, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పారదర్శకంగా పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల కుప్పగా మార్చిందని రేవూరి విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకునేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళలు పాల్గొన్నారు

WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net

వరంగల్ వాయిస్ Evening Daily

GRATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet

సోమవారం, జనవరి 19, 2026

# ప్రజా సమస్యల పరిష్కారమే మొదటి ప్రాధాన్యత

- బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ పాయ్
- 'ప్రజావాణి'లో 71 ఫిర్యాదుల స్వీకరణ
- అత్యధికంగా టౌన్ ప్లానింగ్ విభాగంపైనే వినతులు
- అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్ష



**వరంగల్ వాయిస్, బల్దియా :** ప్రజల నుంచి వచ్చే సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ చాహత్ బాజ్ పాయ్ ఆదేశించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమంలో ఆమె స్వయంగా పాల్గొని ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈరోజు జరిగిన ప్రజావాణిలో మొత్తం 71 ఫిర్యాదులు అందాయి. వాటిలో టౌన్ ప్లానింగ్: 34, ఇంజనీరింగ్: 18, రెవెన్యూ: 10, హెల్త్ అండ్ శానిటేషన్: 06, నీటి సరఫరా: 03గా ఉన్నాయి. వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన కమిషనర్, వెంటనే పరిష్కార నిమిత్తం ఆయా విభాగాల ఉన్నతాధికారులకు అందజేశారు. గడువులోగా సమస్యలను పరిష్కరించి బాధితులకు ఊరట నివ్వాలని సూచించారు. ప్రజావాణి అనంతరం ఇంజనీరింగ్ అధికారులతో కమిషనర్ ప్రత్యేక సమావేశం నిర్వహించారు. నగరంలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. పనులు ఎక్కడెక్కడ పెండింగ్‌లో ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలం లోపు కీలకమైన పనులు పూర్తి చేయాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని అధికారులను ఆదేశించారు. అదనపు కమిషనర్ చంద్రశేఖర్, ఎస్.ఈ సత్యనారాయణ, సీఎంహెచ్ఓ డాక్టర్ రాజారెడ్డి, డీఎఫ్ఓ శంకర్ లింగం, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్న రాణి, సమ్మయ్య, టీఓ రామకృష్ణ, ఈఈలు రవికుమార్, సంతోష్ బాబు, మహేందర్, మాధవీలత, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో ఆత్మకూర్ విద్యార్థుల హవా



**వరంగల్ వాయిస్, ఆత్మకూరు:** జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి ప్రథమ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ క్విజ్ పోటీల్లో జిల్లాలోని వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు. తీవ్రమైన పోటీ నెలకొన్న ఈ క్విజ్ పోటీల్లో ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన జోత్స్న, సిద్ధార్థ, స్రవంతి తమ మేధస్సుతో ప్రథమ స్థానంలో నిలిచారు. అలాగే, ఇదే కళాశాలకు చెందిన హాసిని, షమీమాలు ప్రతిభ చాటి తృతీయ స్థానాన్ని దక్కించుకున్నారు. విజేతలకు నిర్వాహకులు ప్రశంసా పత్రాలతో పాటు నగదు బహుమతులను అందజేసి సత్కరించారు. విద్యార్థులు సాధించిన ఈ విజయం పట్ల కళాశాల ప్రిన్సిపల్ కవిత హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థులను నిరంతరం ప్రోత్సహించి, వారికి సరైన మార్గదర్శకత్వం వహించిన లైబ్రేరియన్ దిలీప్ కుమార్, తెలుగు అధ్యాపకులు కరుణాకర్ రెడ్డిలను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ కళాశాల విద్యార్థులు ప్రైవేటుకు దీటుగా రాణించడం పట్ల అధ్యాపక బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

# ఠంయ్యాలకు పురస్కారం ప్రదానం



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** ప్రముఖ గాయకులు, వ్యాఖ్యాత, వరంగల్ ఎల్.బీ.నగర్‌లోని మాసూమ్ అలీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు ఠంయ్యాల శ్రీధరాచార్యులు ప్రతిష్ఠాత్మకమైన 'కె.జె. ఏసుదాసు ప్రతిభా స్ఫూర్తి పురస్కారం' అందుకున్నారు. గీత ఆర్ట్స్ అకాడమీ – గీత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి హైదరాబాద్‌లోని త్యాగరాజ గానసభలో ప్రముఖ గాయకులు కె.జె. ఏసుదాసు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. లంక లక్ష్మీనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో హర్యానా రాష్ట్ర మాజీ గవర్నర్, మాజీ కేంద్ర మంత్రి బండారు దత్తాత్రేయ ముఖ్య అతిథిగా హాజరై శ్రీధరాచార్యులను అవార్డుతో సత్కరించారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ.. అనేక భాషల్లో వేలాది పాటలు పాడిన ఏసుదాసు క్రమశిక్షణ, అంకితభావం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఆయన పేరుతో ప్రతిభ కలిగిన గాయకులను గుర్తించి పురస్కారాలు అందజేస్తున్న గీత ఫౌండేషన్ అధ్యక్షురాలు గీతను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీధరాచార్యులతో పాటు గాయకులు వై.ఎస్.రామకృష్ణ, రవీంద్ర తదితరులు కూడా పురస్కారాలు అందుకున్నారు. మధ్యాహ్నం 3 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు గాన గంధర్వుడు ఏసుదాసు ఆలపించిన మధుర గీతాలను గాయనీ గాయకులు పాడి సంగీత అభిమానులను మంత్రముగ్ధులను చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ నాయకులు గట్టు మహేష్ బాబు, లయన్ నిర్మల ప్రభాకర్, సరస్వతి ఉపాసకులు దైవజ్ఞ శర్మ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత అయిన శ్రీధరాచార్యులకు ఈ పురస్కారం లభించడం పట్ల విద్యాశాఖ అధికారులు, కవులు, కళాకారులు హర్షం వ్యక్తం చేశారు.

# మేడారం అభివృద్ధి పనులు ఆర్అండ్‌బీ శాఖకు గర్వకారణం

## ఈఎన్సీ జె.మోహన్ నాయక్



**వరంగల్ వాయిస్, మేడారం :** మేడారం సమ్మక్క–సారలమ్మ ఆలయ అభివృద్ధి, నవీనీకరణ పనులను అత్యంత తక్కువ సమయంలో, విజయవంతంగా పూర్తి చేయడం రహదారులు, భవనాల శాఖకు గర్వకారణమని ఆ శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్ జె.మోహన్ నాయక్ అన్నారు. మేడారం టెంపుల్ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్‌గా వ్యవహరిస్తున్న ఆయన, సోమవారం మేడారంలో పనుల ప్రగతిపై ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మోహన్ నాయక్ మాట్లాడుతూ.. ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర కోసం చేపట్టిన ఈ బృహత్తర పునర్నిర్మాణ పనుల్లో ఇంజినీర్లు అంకితభావంతో పనిచేశారని అభినందించారు. పనుల విజయవంతమైన పూర్తిని పురస్కరించుకుని తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ ములుగు జిల్లా శాఖ పక్షాన జె.మోహన్ నాయక్ ని ఘనంగా సన్మానించారు. జిల్లా అధ్యక్షులు ఎం.సంపత్ రావు, సెక్రటరీ కందుల జీవన్ కుమార్, కిరణ్ కుమార్ ఆయనకు శాలువా కప్పి మెమెంటో అందజేశారు. మేడారం గద్దెల పునర్నిర్మాణంలో అహర్నిశలు శ్రమించిన ఇంజినీరింగ్ బృందాన్ని కూడా ఈ సందర్భంగా సత్కరించారు. సన్మానం పొందిన వారిలో రాఘవ రెడ్డి (ఎస్ఈ), సురేష్ బాబు (ఈఈ), బి.శ్యామ్ సింగ్ (ఈఈ, ములుగు జిల్లా), రాజు పడియా (డీఈఈ), ఏఈఈలు నాగరాజు, రత్న శేఖర్, రాకేష్, సాయి తేజ, అవినాష్, వెంకటేష్ లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు రహీం రాజు, రాజకుమార్, ఇతర రెవెన్యూ, ఇంజనీరింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# రాజనీతి శాస్త్రంలో సుమన్‌కు డాక్టరేట్



**వరంగల్ వాయిస్, కేయూ క్యాంపస్ :** కాకతీయ విశ్వవిద్యాలయం రాజనీతి శాస్త్ర విభాగ పరిశోధక విద్యార్థి గుండెటి సుమన్‌కు డాక్టరేట్ లభించింది. ఈ మేరకు విశ్వవిద్యాలయ పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య రాజేందర్ కట్ల అధికారికంగా పట్టాను ప్రకటించారు. విభాగ విశ్రాంత ఆచార్యులు ఆచార్య బి.సంజీవరెడ్డి పర్యవేక్షణలో సుమన్ తన పరిశోధనను పూర్తి చేశారు. "తెలంగాణ రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల మహిళల రాజకీయ అవగాహన, భాగస్వామ్యం – ఒక అధ్యయనం" అనే అంశంపై ఆయన లోతైన పరిశోధన సాగించారు. గుండెటి సుమన్ తెలంగాణ మలిదశ ఉద్యమ సమయంలో క్రియాశీలక పాత్ర పోషించారు. విద్యార్థి దశ నుంచే సామాజిక అంశాలపై పట్టున్న ఆయన, తన పరిశోధన కాలంలో పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సులలో పాల్గొని పరిశోధనా పత్రాలను సమర్పించారు. ఇప్పటి వరకు వివిధ ప్రతిష్ఠాత్మక జర్నల్స్‌లో ఆయన రాసిన 10 పరిశోధనా వ్యాసాలు ప్రచురితమయ్యాయి. వరంగల్ జిల్లా సంగెం మండల కేంద్రానికి చెందిన వ్యక్తిగా, ఆ గ్రామం నుండి డాక్టరేట్ పొందిన మొట్టమొదటి వ్యక్తి సుమన్ కావడం విశేషం. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ బోధన, బోధనేతర సిబ్బంది, తోటి పరిశోధక విద్యార్థులు సుమన్‌ను ఘనంగా అభినందించారు. తన ఎదుగుదలకు సహకరించిన గురువులకు, మిత్రులకు ఈ సందర్భంగా సుమన్ కృతజ్ఞతలు తెలిపారు.

# రోడ్డు భద్రత నియమాలు ప్రాణాలకు రక్షణ

## సీఐ మచ్చ శివకుమార్




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** రహదారిపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారానే విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చని హనుమకొండ ఇన్‌స్పెక్టర్ మచ్చ శివకుమార్ సూచించారు. సోమవారం హనుమకొండ పరిధిలో నిర్వహించిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమంలో భాగంగా ఆయన పాల్గొని వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఒక ప్రత్యేక పద్ధతిని అనుసరించారు. గతంలో ప్రమాదాలు ఎక్కువగా జరిగిన ప్రాంతాలను గుర్తించి, అక్కడికి గతంలో ప్రమాదాలకు గురైన బాధితులను పిలిపించారు. వారు చేసిన చిన్న చిన్న తప్పుల వల్ల ఎదురైన ఇబ్బందులను, వారి ఆవేదనను స్వయంగా వాహనదారుల ముందు వివరించేలా చేశారు. బాధితుల అనుభవాల ద్వారా ప్రజల్లో మార్పు తీసుకురావడమే ఈ కార్యక్రమ ముఖ్య ఉద్దేశమని సీఐ తెలిపారు. ఎస్సైలు సతీష్, సదానందం, బ్లూకోల్ట్ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

# మానసిక దివ్యాంగులకూ ఆస్తి హక్కులు ఉంటాయి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** దివ్యాంగుల సేవను విశ్వమానవ సేవగా భావించాలని అనురాగ్ హెల్పింగ్ సొసైటీ చైర్మన్, కాకతీయ విశ్వవిద్యాలయం పాలకమండలి సభ్యురాలు డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. సోమవారం హన్మకొండలోని మల్లికాంబ మనోవికాస కేంద్రాన్ని ఆమె సందర్శించి, అక్కడ ఉంటున్న చిన్నారులతో ప్రేమగా సమయం గడిపారు. ఈ సందర్భంగా వారికి నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ.. మానసిక దివ్యాంగులకు సమాజంలో అందరిలాగే సమాన హక్కులు ఉంటాయని స్పష్టం చేశారు. ముఖ్యంగా వారికి ఆస్తి హక్కు కూడా వర్తిస్తుందని, చట్టపరంగా వారిని ఎవరూ తక్కువ చేయలేరని తెలిపారు. ప్రత్యేక అవసరాలు గల ఈ పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకోవడం మనందరి బాధ్యతని, వారికి ప్రేమను పంచుతూ అండగా నిలవాలని కోరారు. మానసిక దివ్యాంగులను పిచ్చివాళ్లంటూ హేళన చేయడం, కట్టివేయడం లేదా వారిపై భౌతిక దాడికి దిగడం చట్టరీత్యా నేరమని ఆమె హెచ్చరించారు. అలాంటి చర్యలకు పాల్పడే వారు కఠిన శిక్షలకు అర్హులవుతారని పేర్కొన్నారు. మానసిక పరిపక్వత కోసం ఓర్పుతో విద్యను నేర్పుతున్న మల్లికాంబ మనోవికాస కేంద్రం నిర్వాహకులను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. దివ్యాంగుల అవసరాల కోసం తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు రామలీల, కళ్యాణ్, ఉపాధ్యాయులు, చిన్నారులు పాల్గొన్నారు.

## వనదేవతలకు నాయిని మొక్కుల చెల్లింపు



**వరంగల్ వాయిస్, మేడారం :** ములుగు జిల్లా మేడారం మహాజాతర నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం సమ్మక్క–సారలమ్మలను దర్శించుకున్నారు. ఈ పర్యటనలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్యమంత్రి వెంట ఉండి అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి గద్దెలపై నిలువెత్తు బంగారాన్ని సమర్పించిన నాయిని రాజేందర్ రెడ్డి, వనదేవతల ఆశీస్సులు రాష్ట్ర ప్రజలందరికీ ఉండాలని కోరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని, తెలంగాణ సుభిక్షంగా ఉండాలని అమ్మవార్లను ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మరియు ఇతర ముఖ్య ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. మేడారం జాతరను పురస్కరించుకుని ప్రభుత్వం తరపున కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు ఎమ్మెల్యే నాయిని పేర్కొన్నారు. భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా తాగునీరు, రవాణా, భద్రత, వైద్య సౌకర్యాలపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి జాతరను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా ప్రభుత్వంలో భక్తుల సౌకర్యార్థం ముందస్తుగా అన్ని మౌలిక వసతులు కల్పించినట్లు ఆయన వివరించారు.

## కార్యకర్తల కుటుంబాలకు పరామర్శ



**వరంగల్ వాయిస్, చిట్యాల:** మండల కేంద్రంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు చందుపట్ల సత్యపాల్ రెడ్డి సోమవారం పర్యటించారు. పార్టీ కార్యకర్తలు, నాయకుల కుటుంబాల్లో ఇటీవల సంభవించిన మరణాలు, అనారోగ్య పరిస్థితుల దృష్ట్యా వారిని పరామర్శించి అండగా నిలిచారు. రాంనగర్ కాలనీకి చెందిన బీజేపీ వార్డు సభ్యురాలు వేల్పుల లక్ష్మి గుర్రపు శివ తండ్రి గుర్రపు రామస్వామి, అలాగే జెట్టి అశోక్ తండ్రి ఇటీవల అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలుసుకున్న సత్యపాల్ రెడ్డి మృతుల నివాసాలకు వెళ్లి వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. శోకతప్త హృదయంతో ఉన్న వారి కుటుంబ సభ్యులను ఓదార్చి, పార్టీ పరంగా అన్ని విధాలా అండగా ఉంటామని ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అనంతరం, గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొంది ఇంటికి చేరుకున్న బీజేపీ నాయకులు రాయిని శ్రీనివాస్ ను సత్యపాల్ రెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ చిట్యాల మండల అధ్యక్షులు, ఉప సర్పంచ్ బుర్ర వెంకటేష్ గౌడ్, మణికుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సైబర్ నేరగాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలి



**వరంగల్ వాయిస్, పర్వతగిరి:** తమ గ్రామంలో జరిగిన సైబర్ మోసంపై విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ పర్వతగిరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజగోపాల్ ను జమాల్‌పురం సర్పంచ్ జున్ను కనుకయ్య యాదవ్ సోమవారం కలిశారు. ఈ సందర్భంగా గ్రామంలో కొందరు వ్యక్తులు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి డబ్బులు కోల్పోయిన తీరును సర్పంచ్ సీఐకి వివరించారు. అమాయక ప్రజలను బురిడీ కొట్టిస్తున్న కేటుగాళ్లను త్వరితగతిన గుర్తించి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. స్పందించిన సీఐ రాజగోపాల్.. సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, గుర్తు తెలియని లింకులు, ఓటీపీలను ఎవరికీ షేర్ చేయవద్దని సూచించారు. బాధితుల ఫిర్యాదుపై పూర్తి స్థాయిలో విచారణ చేపడతామని హామీ ఇచ్చారు. సర్పంచ్ వెంట సీనియర్ నాయకులు గోదారి యాకయ్య తదితరులు ఉన్నారు.

# సర్పంచులు ఆదర్శ పాలన అందించాలి

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద
- గంగదేవిపల్లిలో సర్పంచులకు శిక్షణ తరగతులు
- 'స్మార్ట్ పాలన' సాగించాలని పిలుపు



**వరంగల్ వాయిస్, గీసుకొండ:** నూతనంగా ఎన్నికైన సర్పంచులు గ్రామాలను శ్రీరాముని వలె ఆదర్శవంతంగా పరిపాలిస్తూ, ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండి మంచి పేరు సంపాదించుకోవాలని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. దేశంలోనే ఆదర్శ గ్రామంగా పేరుగాంచిన గంగదేవిపల్లిలో జిల్లాలోని 11 మండలాల సర్పంచుల కోసం ఏర్పాటు చేసిన నాలుగు విడతల శిక్షణ తరగతులను సోమవారం ఆమె ప్రారంభించారు. మొదటి విడతలో భాగంగా గీసుకొండ, సంగెం, చెన్నారావుపేట మండలాలకు చెందిన 84 మంది సర్పంచులకు ఈ శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గ్రామ పరిపాలనను సమర్థవంతంగా నిర్వహించేందుకు, ప్రభుత్వ పథకాలపై సంపూర్ణ అవగాహన కల్పించేందుకే ఈ తరగతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పారదర్శకమైన, బాధ్యతాయుతమైన పాలన అందించాలని సూచించారు. సర్పంచులు పంచాయతీ రాజ్ చట్టంలోని అంశాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్రామ పాలన, ఆర్థిక నిర్వహణ, విపత్తుల సమయంలో స్పందించే తీరు, డిజిటల్ సంతకం, ఆదర్శ గ్రామ పంచాయతీల నిర్మాణం వంటి అంశాలపై ఈ శిక్షణలో లోతైన అవగాహన కల్పిస్తామన్నారు. నిరుపేదలకు విద్య, వైద్యం అందేలా చూడటమే కాకుండా.. బాల్య వివాహాలు, కుల వివక్ష, మూఢనమ్మకాల నిర్మూలనలో సర్పంచులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. వరంగల్ మహానగరం రాష్ట్రానికి రెండో రాజధానిగా అవతరించబోతోందని ముఖ్యమంత్రి పేర్కొన్న విషయాన్ని కలెక్టర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. సర్పంచులు ఏఐ వంటి ఆధునిక సాంకేతికతలను వినియోగించుకుంటూ స్మార్ట్ పాలన అమలు చేయాలని, వరంగల్ జిల్లాను రాష్ట్రానికే ఆదర్శంగా నిలపాలని కోరారు. మానవత్వ కోణంలో, సేవాభావంతో నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో రాంరెడ్డి, టీవోటీలు పాక శ్రీనివాస్, కూచన ప్రకాష్, చంద్రకాంత్, జిల్లా ట్రైనింగ్ మేనేజర్ కూసం రాజమౌళి, సర్పంచ్ కూసం స్వరూప రమేష్, మూడు మండలాల పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు పాల్గొన్నారు.

## వృద్ధులకు ఒకే చోట అన్ని వైద్య సేవలు

**ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్ చంద్రా రెడ్డి**



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఎంజీఎం ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే వృద్ధులకు అన్ని రకాల వైద్య సేవలు ఒకే దగ్గర అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్ చంద్రా రెడ్డి తెలిపారు. శనివారం సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా సహాయ కార్యదర్శి డాక్టర్ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో పలువురు ప్రతినిధులు సూపరింటెండెంట్‌ను కలిసి విన్నవించారు. ఓపీ విభాగంలో వృద్ధులకు అందిస్తున్న వైద్య సేవలను మరింత పెంచాలని, వృద్ధుల పట్ల వైద్య సిబ్బంది మర్యాదపూర్వకంగా ప్రవర్తించేలా చూడాలని అసోసియేషన్ ప్రతినిధులు కోరారు. దీనిపై సూపరింటెండెంట్ సానుకూలంగా స్పందిస్తూ.. ఇకపై వృద్ధుల కోసం జనరల్ మెడిసిన్‌తో పాటు జనరల్ సర్జన్, ఆర్థోపెడిక్ వైద్య సేవలను కూడా ఒకే ప్రాంగణంలో అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. దీనివల్ల వృద్ధులు ఆసుపత్రిలో వివిధ విభాగాలకు తిరిగే అవసరం లేకుండా ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు. వృద్ధుల సమస్యలపై సానుకూలంగా స్పందించిన డాక్టర్ హరీష్ చంద్రా రెడ్డిని సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మోహన్ వారణాసి, శ్రీకాంత్, కృష్ణమాచారి, వి.ఆర్.చంద్ర పాల్గొన్నారు.

## మహిళల ఆర్థిక సాధికారతే ధ్యేయం



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మహిళలు ఆర్థికంగా ఎదిగినప్పుడే కుటుంబం, సమాజం అభివృద్ధి చెందుతాయని, మహిళల సాధికారతే తెలంగాణ ప్రభుత్వ లక్ష్యమని పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి అన్నారు. సోమవారం తొర్రూరు పట్టణంలోని బి.ఆర్. ఫంక్షన్ హాల్‌లో మెప్మా, తొర్రూరు పురపాలక సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఇందిరా మహిళా శక్తి సంబరాల'కు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి తొర్రూరు పట్టణానికి చెందిన 114 స్వయం సహాయక సంఘాలకు సంబంధించి రూ.22,30,982 విలువైన వడ్డీ లేని రుణాల సబ్సిడీ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఈ ఆర్థిక వెన్నుదన్నును ఉపయోగించుకుని మహిళలు చిన్న తరహా పరిశ్రమలు, వ్యాపారాలు ప్రారంభించి ఆర్థిక స్వావలంబన సాధించాలని ఆమె పిలుపునిచ్చారు. ప్రభుత్వం మహిళల కోసం ప్రవేశపెట్టిన వడ్డీ లేని రుణాలు, సబ్సిడీలు వారి జీవితాల్లో భరోసా కల్పిస్తున్నాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా డీఆర్‌డీఏ అధికారి, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, ఎంపీడీఓ, మెప్మా అధికారులు, పురపాలక సంఘ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల మహిళలు పాల్గొన్నారు.

# అసౌకర్యాల నుంచే సరికొత్త ఆవిష్కరణలు

- లోకస్ ఎలైట్ సీఈవో అశ్విన్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సమాజాన్ని పట్టిపీడిస్తున్న సమస్యలకు పరిష్కారం చూపడమే నిజమైన ఆవిష్కరణ అని, ప్రతి ఆవిష్కరణ అసౌకర్యం నుండే ఉద్భవిస్తుందని అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ సంస్థ 'లోకస్ ఎలైట్' వ్యవస్థాపకులు, సీఈవో గాయం అశ్విన్ రెడ్డి అన్నారు. ఇండస్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్ రెడ్డి ఆహ్వానం మేరకు సోమవారం హన్మకొండలోని వందఫీట్ల రోడ్డులో గల 'శిఖర స్కిల్ సెంటర్'ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కుట్టు మిషన్, మగ్గం, బ్యూటీషియన్ విభాగాల్లో శిక్షణ పొందుతున్న మహిళలను ఉద్దేశించి అశ్విన్ రెడ్డి మాట్లాడారు. తన 24 ఏళ్ల ప్రాయంలోనే సంస్థను ఎలా నెలకొల్పింది, చదువుకునే రోజుల్లో ఎదురైన సమస్యలను ఎలా అధిగమించింది వివరించారు. నైపుణ్యాన్ని కేవలం నేర్చుకోవడమే కాకుండా, నిరంతర సాధన ద్వారా దానిని వ్యాపారంగా మలుచుకోవాలని మహిళలకు సూచించారు. తన మిత్రుడు రాకేష్ రెడ్డి మహిళలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దడానికి చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేష్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రతి మనిషిలో ఒక నైపుణ్యం ఉన్నప్పుడే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. ఒక ఇంట్లో ఆడబిడ్డ నైపుణ్యం కలిగి ఉంటే, ఆమె తన కాళ్ళ మీద తాను నిలబడటమే కాకుండా మొత్తం కుటుంబాన్నే ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే శిఖర స్కిల్ సెంటర్ ప్రధాన ఉద్దేశమని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రవి నాయక్, సెంటర్ నిర్వాహకులు జ్యోతి, గువ్వ రాజేష్, కార్తీక్ రెడ్డి, ఇండస్ ఫౌండేషన్ సభ్యులు పురుషోత్తం యాదవ్, అఖిల్ రెడ్డి, సుమన్ గౌడ్, హరీష్, రమేష్, అనిల్, భాస్కర్, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.

7
WARANGALVOICE
www.epaper.warangalvoice.net
www.warangalvoice.net
వరంగల్ వాయిస్ Evening Daily
GREATER WARANGAL
Hanamkonda | Mahabubabad | Jangaon | Dornakal
Bhupalapaly | Mulugu | Parakala | Narsampet
Station Ghanpur | Palakurthy | Waradannapet
సోమవారం, జనవరి 19, 2026





# మేడారానికి సరికొత్త రూపు

- అరణ్యం పులకించేలా..
- వనవిరిసిన 'కుంభమేళా'
- సరికొత్త సొగసులతో మేడారం జాతర
- భక్తజనం మురిసేలా ఏర్పాట్లు

ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతర, దక్షిణాది కుంభమేళాగా ఖ్యాతిగాంచిన మేడారం సమ్మక్క–సారలమ్మ మహాజాతర–2026 సరికొత్త హంగులతో ముస్తాబైంది. ములుగు అరణ్యాల్లోని వనదేవతల సన్నిధి మునుపెన్నడూ లేని రీతిలో అభివృద్ధి సొగబులు అద్దుకుంది. ప్రజా ప్రభుత్వం ఈ జాతరను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడంతో, మేడారం పరిసరాలు ఇప్పుడు భక్తిశ్రద్ధలతో పాటు అత్యాధునిక సౌకర్యాల కలబోతగా మారి సరికొత్త సందడిని సంతరించుకున్నాయి. ఒకవైపు పచ్చని అటవీ ప్రకృతి.. మరోవైపు తండోపతండాలుగా తరలివచ్చే భక్తజనం.. వెరసి మేడారం జాతర జనారణ్యాన్ని తలపిస్తోంది. భక్తుల సౌకర్యార్థం ఈసారి ప్రభుత్వం కల్పించిన వసతులు అద్వితీయంగా ఉన్నాయి. స్నాన ఘట్టాల నుంచి గద్దెల ప్రాంగణం వరకు ప్రతి అడుగూ భక్తులకు సౌకర్యవంతంగా ఉండేలా తీర్చిదిద్దారు. పారిశుధ్యం, రవాణా, భద్రత వంటి అంశాలలో రాజీ పడకుండా చేసిన ఏర్పాట్లు ఉత్తర భారత కుంభమేళాను తలపిస్తున్నాయి. ఈ నెల 28 నుంచి 31 వరకు నాలుగు రోజుల పాటు జరగనున్న ఈ మహాజాతర, తెలంగాణ సంస్కృతికి ప్రతిబింబంగా నిలవనుంది. 'నభూతో నభవిష్యత్తు' అనే రీతిలో సాగే ఈ వేడుకకు అశేష భక్తజనం ఇప్పటికే తరలివస్తోంది. వనదేవతల ఆగమనం, గద్దెలకు చేరిక, చివరగా వన ప్రవేశం వరకు ప్రతి ఘట్టం ఈసారి కన్నులపండువగా నిర్వహించేందుకు యంత్రాంగం అన్ని హంగులు సిద్ధం చేసింది. కనివిని ఎరుగని అభివృద్ధి పనులతో మేడారం కొత్త రూపు సంతరించుకోవడంతో, ఈ ఏడాది జాతర చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచిపోనుంది.

































# సీఎం పర్యటన సూపర్ హిట్

- అడవిలో క్యాబినెట్ మీటింగ్ అద్భుతం
- రాష్ట్ర మంత్రి సీతక్క
- పొట్లాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రకటన చారిత్రాత్మకం

**వరంగల్ వాయిస్, మేడారం :** మేడారం జాతర చరిత్రలో ఇదొక నూతన అధ్యాయమని, అడవి బిడ్డల చెంతకు రాష్ట్ర క్యాబినెట్‌ను తీసుకువచ్చి అభివృద్ధికి బాటలు వేశామని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) పేర్కొన్నారు. మేడారంలోని హరిత హోటల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటన, గద్దెల ప్రాంగణం ప్రారంభోత్సవం విజయవంతం కావడంపై ఆమె హర్షం వ్యక్తం చేశారు. సాధారణంగా హైదరాబాద్‌లోని సచివాలయానికి పరిమితమయ్యే క్యాబినెట్ సమావేశాన్ని, ప్రజల చెంతకు.. అడవిలోకి తీసుకువచ్చిన ఘనత తమ ప్రభుత్వానిదేనని సీతక్క అన్నారు. "రెండు రోజుల పాటు ముఖ్యమంత్రి, మంత్రుల కుటుంబాలు ఇక్కడే బస చేయడం, ఇక్కడే క్యాబినెట్ సమావేశం నిర్వహించి 'పొట్లాపూర్ లిఫ్ట్ ఇరిగేషన్' స్కీమ్‌ను ప్రకటించడం ములుగు జిల్లాకే గర్వకారణం" అని ఆమె కొనియాడారు. గద్దెల ప్రాంగణం ప్రారంభోత్సవంతో జాతరలో ఒక ముఖ్య ఘట్టం (కట్ట) ముగిసిందని మంత్రి తెలిపారు. "ఈ బుధవారం 'మండే మెలిగే' పండుగ ఉంది. అప్పటి నుంచి నిండు జాతర ముగిసే వరకు ఇదే ఉత్సాహంతో భక్తులకు సేవలు అందించాలి" అని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా ఈ పర్యటనలో మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి ముఖ్యమంత్రితో కలిసి అమ్మవార్లను దర్శించుకోవడం శుభపరిణామమని పేర్కొన్నారు. సీఎం పర్యటనను, క్యాబినెట్ భేటీని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరినీ మంత్రి అభినందించారు. అటెండర్ నుంచి చీఫ్ సెక్రటరీ వరకు, హోంగార్డు నుంచి డీజీపీ వరకు అహర్నిశలు శ్రమించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. వనదేవతల కీర్తిని ప్రపంచవ్యాప్తం చేసినందుకు మీడియాకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. స్వచ్ఛందంగా తరలివచ్చి పర్యటనను సక్సెస్ చేసిన మహిళలకు కృతజ్ఞతలు తెలుపుతూ, అమ్మవార్ల స్ఫూర్తితో మహిళలు మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఎక్కడా చిన్న లోటుపాట్లు లేకుండా జాతర పనులను పర్యవేక్షించిన జిల్లా యంత్రాంగాన్ని ఆమె ప్రత్యేకంగా అభినందించారు.

# సర్పంచులు బాధ్యతాయుతంగా పని చేయాలి

- కమిషనర్ శ్రుతి ఓజా, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్
- పల్లెల్లో సుపరిపాలనే లక్ష్యంగా శిక్షణ కార్యక్రమం
- జ్యోతి ప్రజ్వలనతో సర్పంచుల శిక్షణ ప్రారంభం



**వరంగల్ వాయిస్, జనగామ :** గ్రామ అభివృద్ధిలో సర్పంచ్‌ల పాత్ర అత్యంత కీలకమని, వారు నిష్పక్షపాతంగా, బాధ్యతాయుతంగా పని చేసినప్పుడే పల్లెలు ప్రగతి పథంలో పయనిస్తాయని పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ శ్రుతి ఓజా అన్నారు. కొత్తగా ఎన్నికైన సర్పంచ్‌లకు గ్రామ పంచాయతీ పాలన, విధులు, అభివృద్ధి అంశాలపై స్థానిక సీజేఐటీలో ఐదు రోజుల పాటు నిర్వహించే శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం కమిషనర్ శ్రుతి ఓజా, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్, జడ్పీ సీఈఓ మాధురి, ఇంచార్జి డీపీవో వసంత కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రుతి ఓజా మాట్లాడుతూ.. మొదటి విడతలో పాలకుర్తి, దేవరుప్పుల, కొడకండ్ల మండలాలకు చెందిన సర్పంచ్‌లకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. పంచాయతీ రాజ్ చట్టంలో సర్పంచ్‌లకు కల్పించిన అధికారాలు, విధులను ఈ ఐదు రోజుల్లో క్షుణ్ణంగా అవగాహన చేసుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి ఎద్దడి నివారణ వంటి కీలక అంశాలపై సర్పంచులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సర్పంచులు సమర్థవంతంగా పనిచేస్తేనే రాష్ట్ర స్థాయిలో గ్రామాలకు గుర్తింపు లభిస్తుందని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ మాట్లాడుతూ.. ప్రభుత్వ సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందడంలో సర్పంచులు వారధిలా పనిచేయాలన్నారు. ఆర్థిక నిర్వహణ, విపత్తుల సమయంలో స్పందించే తీరు, డిజిటల్ సంతకం, ఆదర్శ గ్రామ పంచాయతీల నిర్మాణం వంటి అంశాలపై ఈ శిక్షణలో అవగాహన కల్పిస్తామన్నారు. మానవతా దృక్పథంతో పనిచేస్తూ నిరుపేదలకు విద్య, వైద్యం అందేలా కృషి చేయాలని, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం సర్పంచ్‌లకు శిక్షణ కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, సర్పంచులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కొత్తవారికి 'నో' ఛాన్స్

- పాత క్యాడర్‌కే ప్రాధాన్యం..
- ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్

**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** రానున్న మున్సిపల్ ఎన్నికల్లో పార్టీ కోసం మొదటి నుంచి కష్టపడిన పాత క్యాడర్ నాయకులకే కౌన్సిలర్ టికెట్లు ఇస్తామని, ఇతర పార్టీల నుంచి కొత్తగా వచ్చిన వారికి పోటీ చేసే అవకాశం లేదని డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రు నాయక్ స్పష్టం చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో రుణాల చెక్కుల పంపిణీ అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డోర్నకల్ పట్టణ ప్రజలు తనను అత్యధిక మెజార్టీతో గెలిపించినందుకు ఎప్పటికీ రుణపడి ఉంటానని ఎమ్మెల్యే తెలిపారు. ఇటీవల ప్రతి వార్డుకు రూ.1కోటి నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి నాయకులు చేరుతున్నారని, అయితే ఎన్నికల బరిలో మాత్రం పార్టీ నమ్ముకున్న వారికే ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. ఈ నెల 25లోపు మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని, వచ్చే నెల 11లోపు ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందని ఎమ్మెల్యే వివరించారు. పార్టీ నిర్ణయించిన అభ్యర్థుల గెలుపు కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని, ఒకరినొకరు ఓడించుకునే ప్రయత్నాలు చేయవద్దని హితవు పలికారు. డోర్నకల్ మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగురవేసి, చైర్మన్ పీఠాన్ని దక్కించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు తవ్వ వరలక్ష్మికి ఎమ్మెల్యే కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో వాంగుడోత్ వీరన్న, కేశబోయిన కోటిలింగం, మాద శ్రీనివాస్, రమేష్, పోటు జనార్దన్, హరికృష్ణ, శీలం శ్రీనివాస్, ఖాదర్ బాబా, ఫరీద్, దాసరి నాని తదితరులు పాల్గొన్నారు.

# కఠినమైన ఖాకీ డ్రెస్సు వెనుక వెన్నలాంటి మనసు

☐ అనాథ బాలికలకు ఇల్లు కట్టిస్తున్న నెక్కొండ ఎస్సై

**వరంగల్ వాయిస్, నెక్కొండ :** శాంతిభద్రతల పరిరక్షణలో కఠినంగా వ్యవహరించే పోలీసు అధికారిలో ఒక మమకారమున్న వ్యక్తి కూడా ఉన్నాడని నెక్కొండ ఎస్సై మహేందర్ నిరూపించారు. ఆపదలో ఉన్న చిన్నారుల దైన్య స్థితిని చూసి చలించిన ఆయన, వారికి సొంత ఖర్చులతో ఇల్లు కట్టించి ఇచ్చేందుకు ముందుకు రావడం సర్వత్రా ప్రశంసలకు దారితీస్తోంది. వరంగల్ జిల్లా నెక్కొండ మండలం పెద్ద కొర్పోలు గ్రామానికి చెందిన ఇద్దరు బాలికలు ఆరు నెలల క్రితం తమ తల్లిదండ్రులను కోల్పోయి అనాథలయ్యారు. నిలువ నీడ లేక, ఆదరించే వారు లేక ఆ చిన్నారులు పడుతున్న ఇబ్బందులను స్థానిక పత్రికల ద్వారా తెలుసుకున్న ఎస్సై మహేందర్ వెంటనే స్పందించారు. తన సొంత నిధులతో ఆ బాలికల కోసం రెండు గదుల ఇంటిని నిర్మించాలని సంకల్పించిన ఎస్సై, సోమవారం స్వయంగా ముగ్గు పోసి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. "పోలీసులు అంటే కేవలం కేసులు, దర్యాప్తులే కాదు.. సమాజంలో ఇబ్బందుల్లో ఉన్న వారికి అండగా ఉండటం కూడా మా బాధ్యతే" అని ఆయన ఈ సందర్భంగా చాటిచెప్పారు. పిల్లల పట్ల ఎస్సై గారు చూపుతున్న ఈ ఉదారతపై గ్రామస్థులు, సోషల్ మీడియా వేదికగా నెటిజన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఖాకీ డ్రెస్సు వెనుక ఉన్న వెన్నలాంటి మనసును చూసి నెక్కొండ ప్రజలు ఆయనను అభినందనలతో ముంచెత్తుతున్నారు.



# సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ ఆగ్రహం



## పోలీస్ కమిషనర్‌కు ఫిర్యాదు

**వరంగల్ వాయిస్, హనుమకొండ:** ఖమ్మంలో జరిగిన సీపీఐ బహిరంగ సభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీపై చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ ఆధ్వర్యంలో నేతలు సోమవారం సాయంత్రం వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ ను కలిసి ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రిపై కేసు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్ భాస్కర్, చల్లా ధర్మారెడ్డి, బీఆర్ఎస్ నేత నాగుర్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రేవంత్ రెడ్డి మతిభ్రమించి మాట్లాడుతున్నారని, ప్రతీకార రాజకీయాలకు తెరలేపారని మండిపడ్డారు. బీఆర్ఎస్ నాయకులు , నరెడ్ల శ్రీధర్, పులి రజినీకాంత్, కొడకండ్ల సదాంత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com